సర్కార్ బడుల్లో సమ్మర్ జోష్ 2







2 శ్రీనగర్‌లో దొంగల బీభత్సం..



AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
www.aksharatodaynews.com





నగరంలోని ఓల్డ్ హౌసింగ్ బోర్డు కాలనీలో మాతృ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక బీ–2 డాన్స్ స్కూల్‌లో చిన్నారుల మధ్య కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. – అక్షరటుడే, ఇందూరు



## ఓటర్లంతా ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేయించుకోవాలి



**అక్షరటుడే, ఇందూరు:** నిజామాబాద్ నగర పాలక సంస్థ పరిధిలోని ప్రతి ఓటరు ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) మ్యాపింగ్ చేసుకోవాలని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ దిలీప్ కుమార్ కోరారు. ఎస్ఐఆర్ మ్యాపింగ్ ప్రక్రియపై ఎలాంటి అపోహలు పెట్టుకోవద్దని ఆయన సూచించారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. ఓటరు జాబితాను సమగ్రంగా పరిశీలించడమే ఎస్ఐఆర్ ప్రక్రియ ముఖ్య ఉద్దేశమని కమిషనర్ తెలిపారు. 2002 ఓటరు జాబితా ఆధారంగా ఇప్పుడు ఎస్ఐఆర్ మ్యాపింగ్ చేస్తున్నారని అన్నారు. 2002 ఓటర్ జాబితాలో పేరు ఉంటే, ప్రస్తుతం 2025 ఓటరు జాబితాలోని పేరుతో సెల్ఫ్ మ్యాపింగ్ చేసుకోవచ్చని సూచించారు. బూత్ లెవెల్ ఆఫీసర్ల ద్వారా మ్యాపింగ్ చేయించుకోవచ్చని పేర్కొన్నారు. మన ప్రస్తుత ఓటర్ కార్డ్ ని 2002 జాబితాలో ఉన్న వాళ్ల ఓటర్ కార్డును లింక్ చేసుకోవడం లేదా మనకు 2002లో ఓటు ఉంటే దాంతో మనం మనల్ని లింక్ చేసుకోవడం ద్వారా మ్యాపింగ్ చేసుకోవాలని కోరారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో ప్రీ మ్యాపింగ్ కొనసాగుతోందని, త్వరలో ఎస్ఐఆర్ ప్రారంభమవుతుందని మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ పేర్కొన్నారు. మ్యాపింగ్ ఎన్యూమరేషన్ ఫామ్‌తో పాటు ఈసీ పేర్కొన్న డాక్యుమెంట్లు సమర్పించాల్సి ఉంటుందని కమిషనర్ తెలిపారు. మ్యాపింగ్ పూర్తయిన వాళ్లు ఎటువంటి డాక్యుమెంట్స్ సమర్పించాల్సిన అవసరం ఉండదని అన్నారు.



## మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

**అక్షరటుడే, బోధన్ :** నవీపేట్ మండలం బినోల సొసైటీ పరిధిలోని శాఖాపూర్ గ్రామంలో ఆదివారం మక్కల కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ ఛైర్మన్ మగ్గరి హన్మాండ్లు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన మక్కలను కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చి మద్దతు ధర రూ.2,400 పొందాలన్నారు. అలాగే రైతులు మక్కల తేమశాతం 14 శాతం మించకుండా ఆరబెట్టాలని సూచించారు. ఎకరాకు 26 క్వింటాళ్ల 50 కిలోలు మాత్రమే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. బినోల సొసైటీ పరిధిలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంజూరు చేయించిన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి సొసైటీ, రైతుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. లింగాపూర్ సర్పంచ్ శ్యామల బాల్ రాజ్ గౌడ్, లింగాపూర్ డైరెక్టర్ బాలుచందర్ గౌడ్, ఉప సర్పంచ్ ఒడ్డెన్న, సీఈవో రమేష్, మోహన్, మొగులయ్య, పోతన్న, దేవన్న, రాజేశ్వర్, ధర్మన్న, సాయిలు రైతులు పాల్గొన్నారు.

# పట్టా పాస్‌బుక్‌లు అందేనా?

**భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుని నెలలు గడుస్తున్నా రైతులకు కొత్త పట్టాదారు పాస్ పుస్తకాలు అందడం లేదు. దీంతో జిల్లాలోని వేలాది మంది రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగంగా జరుగుతున్నప్పటికీ, తుది దశలో పాస్ పుస్తకాల ముద్రణ, పంపిణీలో జరుగుతున్న ఆలస్యం అన్నదాతను ఇక్కట్ల పాలు చేస్తోంది.**

**- అక్షరటుడే, భీమ్‌గల్**

- **రిజిస్ట్రేషన్లు పూర్తయిన రాని వైనం**
- **నిరీక్షిస్తున్న రైతులు**




నిజామాబాద్ జిల్లాలో ప్రతిరోజూ వందలాది రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఇప్పటికే పాస్ బుక్ ఉన్న వారికి.. కొత్తగా నమోదైన భూవి వివరాలు అందులో ప్రింట్ చేసి ఇస్తున్నారు. అయితే తొలిసారి భూమి రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి పట్టా పాస్‌బుక్కులను పోస్ట్ ద్వారా ప్రభుత్వం పంపిస్తుంది. కొంతకాలంగా ఈ ప్రక్రియలో తీవ్ర జాప్యం నెలకొంది. ఫలితంగా రైతులు నిత్యం పోస్ట్ ఆఫీసుల చుట్టూ తిరుగుతున్నారు. జిల్లావ్యాప్తంగా సుమారు 15 వేల మంది రైతులు కొత్త పాస్ పుస్తకాల కోసం ఎదురుచూస్తున్నారు.

### ఆన్‌లైన్‌లో కనిపిస్తున్నా..

తహశీల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ పూర్తయి, ఆన్‌లైన్‌లో వివరాలు కనిపిస్తున్నప్పటికీ భౌతికమైన పాస్ పుస్తకాలు పోస్టులో రాకపోవడం ప్రధాన సమస్యగా మారింది. తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు చేస్తున్నా, "పై స్థాయి నుంచి ముద్రణ కావాలి" "పోస్టులో వస్తాయి" అనే సమాధానాలే వినిపిస్తున్నాయి. దీంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా పంట రుణాల కోసం బ్యాంక్‌కు వెళ్తే పట్టా పాస్ బుక్కు అడుతున్నారు. అది రాకపోవడంతో అన్నదాతలు రుణం తీసుకోలేకపోతున్నారు. ఆన్‌లైన్ కాపీలు చూపిస్తున్నా అధికారులు ఒప్పుకోవడం లేదని రైతులు వాపోతున్నారు.

### అందుకే ఆలస్యం

రైతులు రిజిస్ట్రేషన్ చేసుకునే సమయంలో కొత్త పాస్ పుస్తకం కోసం సైతం డబ్బులు చెల్లిస్తారు. రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిన తర్వాత ప్రభుత్వం పోస్ట్‌లో పాస్ బుక్కులను పంపిస్తుంది. అయితే పాస్ పుస్తకాల ముద్రణలో సాంకేతిక కారణాలు, ప్రింటింగ్ ఏజెన్సీల వద్ద ఉన్న పెండెన్సీ వల్ల కొంత ఆలస్యం జరుగుతోందని అధికారులు తెలిపారు. త్వరలోనే పెండింగ్‌లో ఉన్న పుస్తకాలన్నింటినీ పోస్టు ద్వారా సంబంధిత రైతుల చిరునామాలకు పంపిస్తామని పేర్కొన్నారు. అన్నదాతలు ఆందోళన చెందొద్దన్నారు.

### ఆరు నెలలు అవుతోంది..

నేను భూమి రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆరు నెలలు దాటింది. ఆన్‌లైన్‌లో నా పేరు చూపిస్తోంది కానీ పాస్ పుస్తకం మాత్రం ఇంటికి రాలేదు. అప్పు కోసం బ్యాంకుకు వెళ్తే పుస్తకం ఉంటేనే లోన్ ఇస్తామంటున్నారు. సాగు పెట్టుబడికి తిప్పలు తప్పడం లేదు.

**– గంగారాం, రైతు, భీమ్‌గల్**

## జాతీయ జనగణనలో బీసీ కులగణన సైతం చేపట్టాలి

**అక్షరటుడే, ఇందూరు:** దేశవ్యాప్తంగా చేపట్టబోయే జాతీయ జనగణలో బీసీ కులగణన కూడా చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని పులాంగ్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహం వద్ద ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం బీసీలకు కులగణన చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చిందని.. కానీ ప్రస్తుతం కులగణన లేకుండా కేవలం జనగణన చేపట్టడం ఎంతవరకు సమంజసమన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ పిలుపు మేరకు బీసీల నిరసన గళాన్ని వినిపిస్తున్నామన్నారు. నల్లకండువాలు ధరించి నిరసన తెలిపారు. కేంద్రం గతంలో ఇచ్చిన తమ హామీ మేరకు వెంటనే బీసీ కులగణన చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఎప్పుడో బ్రిటిష్ పాలకుల సమయంలో 1930లో బీసీ కుల గణన జరిగిందన్నారు. దాదాపు వందేళ్లవుతున్నా గణన జరగకపోవడం విచారకరమన్నారు. చెట్లు, పుట్ట, జంతువుల గణన ఈ దేశంలో ఉంది కానీ బీసీల జన గణన లేకపోవడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో దర్శనం దేవేందర్, మాడవేడి వినోద్ కుమార్, కొట్టూరు చంద్రకాంత్, శ్రీలత, సాయి బసవ, బాలన్న, నర్సయ్య, సత్యనారాయణ, శంకర్, సుమన్ తదితరులు పాల్గొన్నారు.



## యువకవి సింగీతం సంతోష్ కుమార్‌కు 'మాతృ సేవ బంధు' బిరుదు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** అంతర్జాతీయ మాతృ దినోత్సవం సందర్భంగా తెలుగు కళా రత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ, ఉషోదయ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'అమ్మ' అనే అంశంపై ఆన్‌లైన్ కవిత పోటీలు నిర్వహించింది. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఎల్లారెడ్డి మైనార్టీ గురుకుల పాఠశాల ఉపాధ్యాయుడు, యువ కవి సింగీతం సంతోష్ కుమార్‌కు సేవాసంస్థ 'మాతృసేవ బంధు' బిరుదును ఇచ్చింది. ఈ విషయాన్ని సింగీతం సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. కవి సంతోష్ కుమార్‌కు బిరుదు రావడంపై పాఠశాల ప్రిన్సిపాల్, తోటి ఉపాధ్యాయులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. సాహిత్య రంగంలో సంతోష్ కుమార్ సేవలను వారు కొనియాడారు.



## పాలిసెట్ పరీక్షకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** పాలిటెక్నిక్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్‌కు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు సీపీ సాయిచైతన్య పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. నిజామాబాద్ నగరంలో ఈనెల 13న పరీక్ష జరుగనుందని.. మొత్తం 15 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారని సీపీ తెలియజేశారు. ప్రతి కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పరీక్షలు జరిగే రోజు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కేంద్రం పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 163 బీఎన్ఎస్ఎస్ (163 BNSS) అమలులో ఉంటుందని వెల్లడించారు. పరీక్షా కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిలో ఇద్దరికి మించి గుంపులుగా తిరగడం నిషేధమన్నారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఇంటర్నెట్ సెంటర్లు, జిరాక్స్ షాపులు, స్టేషనరీ దుకాణాలను తప్పనిసరిగా మూసివేయాలని సంబంధిత యజమానులకు సూచనలు జారీ చేసినట్లు తెలిపారు. పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పోలీస్ అధికారులు, సిబ్బందితో ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేస్తామని సీపీ తెలిపారు. కేంద్రాల వద్ద అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచుతామన్నారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## ఆరోగ్యకరమైన జీవనశైలికి 'పరుగు' ఎంతో ఉపయోగకరం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** ఆరోగ్యకరమైన జీవనశైలికి రన్నింగ్ ఎంతో ఉపయోగకరమని అదనపు డీసీపీ శుభం ప్రకాశ్ అన్నారు. నగరంలో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్‌లో తొలి ప్రోమో రన్‌ను ఏసీపీ ప్రకాశ్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేసుకునేందుకు ఇలాంటి రన్నింగ్ కార్యక్రమాలు ఎంతో అవసరం అని వారు పేర్కొన్నారు. యువత ఫిట్‌నెస్, క్రమశిక్షణ వైపు మళ్లాలని, ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో మంచి మార్పునకు దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ఆర్పీ సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిని నిర్వాహకులు ప్రత్యేకంగా అభినందించారు. సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ కార్యదర్శి మగ్గారి శ్రీనివాస్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా రన్నింగ్ కల్చర్‌ను విస్తరించేందుకు, ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు 'తెలంగాణ రన్ టూర్'ను వివిధ జిల్లాల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. నిజామాబాద్ ప్రజలు చూపిన విశేష స్పందన తమకు ఎంతో ఆనందాన్ని కలిగించిందన్నారు. త్వరలోనే నిజామాబాద్‌లో మరొక భారీ రన్ నిర్వహించనున్నట్లు సొసైటీ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో పలువురు ప్రభుత్వ ఉద్యోగులు, పోలీస్ సిబ్బంది, యువతీయువకులు పాల్గొన్నారు. రన్ అనంతరం విజేతలకు అతిథులు బహుమతులు అందజేయగా, నిర్వాహకులు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ మెడల్స్, అల్పాహారం అందజేశారు. ఆర్పీ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండీ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఆరోగ్యంపై అవగాహన పెంచే ఇలాంటి కార్యక్రమాలకు తమ సంస్థ ఎల్లప్పుడూ మద్దతు ఇస్తుందన్నారు. డాక్టర్ సీనునాయక్ డెంటల్ హాస్పటల్ ఎండీ శ్రీను నాయక్, డా. హరి కృష్ణ, రన్నర్లు రజినేష్, మహేష్, అభిషేక్, శ్రీనివాస్ ఈ రన్ విజయవంతం కావడంలో కీలక పాత్ర పోషించారు. కార్యక్రమంలో నిర్వాహకులు పన్నాల హరీష్ రెడ్డి, సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ సభ్యులు పాల్గొన్నారు.




## నిఘా నీడలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు : డీఐఈవో రవికుమార్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** సీసీకెమెరాల నిఘానీడలో ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగనున్నాయని డీఐఈవో రవికుమార్ అన్నారు. ఆదివారం నిజామాబాద్ బాలుర (ఖిల్లా) జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అసిస్టెంట్ చీఫ్ సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించారు. ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులదే కీలకపాత్ర అని పాత్ర అని, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే ఇంటర్ బోర్డు కఠిన చర్యలు తీసుకుంటుందని డీఐఈవో పేర్కొన్నారు. జిల్లాలో 39 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 13వ తేదీ నుంచి 19వరకు జరిగే పరీక్షల కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేసినట్లు ఆయన వివరించారు. సీఎస్, డీవోలు తమకు కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో వెంటనే సీసీ కెమెరాలు పనిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రశ్నపత్రాల బండిళ్లను సైతం కెమెరాల ముందే ఓపెన్ చేయాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు వెంటనే సమకూర్చాలని డీఐఈవో ఆదేశించారు. సెల్ ఫోన్లను ఎట్టి పరిస్థితిల్లో పరీక్ష కేంద్రంలోకి అనుమతించే ప్రసక్తే లేదని, సీఎస్, డీవోలు కూడా పరీక్ష జరుగుతున్న సమయంలో పోలీస్ కస్టడీలోనే సెల్ ఫోన్లు ఉంచాలని సూచించారు. పరీక్షల నిర్వహణకు ముందే ఇన్విజిలేటర్ల సమావేశం నిర్వహించి తగిన నియమ నిబంధనలు వివరించాలని ఆదేశించారు. ప్రతి రోజు ఫ్లయింగ్, సిట్టింగ్, ఇంటర్ బోర్డు స్క్వాడ్‌లతో పాటు జిల్లా పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు అన్ని పరీక్షా కేంద్రాలను తనిఖీ చేస్తారని అన్నారు. పరీక్ష ప్రారంభం అయ్యాక ఐదు నిమిషాల వరకు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించవచ్చని జిల్లా ఇంటర్ విద్యాధికారి తెలియజేశారు. పరీక్షల నిర్వహణకు ముందు, పరీక్ష జరుగుతున్న సమయంలో, పరీక్ష పూర్తయిన తర్వాత తీసుకోవాల్సిన చర్యలను పరీక్షల నిర్వహణ కమిటీ సభ్యులు నుస్రత్ జహాన్, రజియా సుల్తానా, ఖిల్లా బాలుర కళాశాల ప్రిన్సిపల్ ఖాలిక్, అధికారి చిన్నయ్య తెలియజేశారు.





## కామారెడ్డి రక్తదాతల సమూహానికి 'రియల్ ఛాంపియన్' అవార్డు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** కామారెడ్డి రక్తదాతల సమూహానికి తలసేమియా హానరింగ్ రియల్ ఛాంపియన్ అవార్డ్స్ లభించింది. తలసేమియా సికిల్ సెల్ సొసైటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో 'తలసేమియా హానరింగ్ రియల్ ఛాంపియన్ అవార్డ్స్ 2026' కార్యక్రమం హైదరాబాద్‌లో ఆదివారం జరిగింది. కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు మహమ్మద్ జమీల్ అహ్మద్, ఉపాధ్యక్షుడు పరుష వెంకట రమణ అవార్డు అందుకున్నారు. తలసేమియా చిన్నారుల కోసం స్వచ్ఛంద రక్తదాన శిబిరాలు నిర్వహించి విశేష సేవలు అందించిన వారికి ఈ అవార్డులను ప్రదానం చేశారు. తలసేమియా సికిల్ సెల్ సొసైటీ అధ్యక్షుడు చంద్రకాంత్ అగర్వాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్తా, అలేఖ్య ప్రాజెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో కుర్ర శ్రీనాథ్, సొసైటీ వైస్ ప్రెసిడెంట్ రత్నావళి చేతుల మీదుగా వీరు అవార్డు స్వీకరించారు. కామారెడ్డి రక్తదాతల సమూహ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు మాట్లాడుతూ తాము ఇప్పటివరకు 35 రక్తదాన శిబిరాల ద్వారా తలసేమియాతో బాధపడుతున్న చిన్నారుల కోసం 5000 యూనిట్ల రక్తాన్ని సేకరించామని తెలిపారు. జమీల్ అహ్మద్, వెంకట రమణలను జీడిమెట్ల సీఐ గడ్డం మల్లేష్, కామారెడ్డి రక్తదాతల సమూహ వ్యవస్థాపకులు డాక్టర్ బాలు, గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వేదప్రకాష్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ పట్ల అనిల్ కుమార్, డీసీసీ ఉపాధ్యక్షుడు గంప ప్రసాద్ తదితరులు అభినందించారు.

## స్పెషల్ లీవ్ పిటిషన్‌ను విరమించుకోవాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** డీఎస్సీ 2003, ఇతర నోటిఫికేషన్ల ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి 'పాత పింఛన్ విధానం' అమలు చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చింది. అయితే ఈ తీర్పును సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను వెంటనే విరమించుకోవాలని తెలంగాణ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని కామారెడ్డి జిల్లా టీటీయూ అధ్యక్షుడు ఎండీ ముజిబొద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి కాంబ్లె గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 2న ఉద్యోగ ఐకాస నేతలతో జరిపిన చర్చల సందర్భంగా సెప్టెంబరు 2004కి ముందు జారీ అయిన నోటిఫికేషన్ల ద్వారా నియమితులైన వారికి 'పాత పెన్షన్ విధానం' అమలుపై పరిశీలిస్తామని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని వారు గుర్తుచేశారు. సీఎం హామీకి భిన్నంగా ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయడం ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో దిగ్భ్రాంతి కలిగించిందని టీటీయూ నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీని నిలబెట్టుకొని, వెంటనే పిటిషన్‌ను విరమించుకోవాలని వారు కోరారు.



# సర్కారు బడుల్లో సమ్మర్ జోష్..

■ మే 11 నుంచి 'ప్రత్యేక విద్యా వారోత్సవం' ■ విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు..
■ పాఠశాలలపై అవగాహన కల్పించేవిధంగా క్యాంప్‌లు

**'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రాష్ట్ర విద్యాశాఖ ఈ నెల 11 నుంచి 17 వరకు 'ప్రత్యేక విద్యా వారోత్సవం' నిర్వహించనుంది. వారం రోజుల పాటు కామారెడ్డి జిల్లావ్యాప్తంగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని పలు కార్యక్రమాలను ప్రభుత్వం చేపట్టనుంది.**
**– అక్షరటుడే, ఎల్లారెడ్డి**

ఉన్నత పాఠశాలల్లో మే 11 నుంచి సమ్మర్ క్యాంప్‌లు నిర్వహించనున్నారు. ఈ క్యాంపుల్లో విద్యార్థులకు అకాడమిక్ అభివృద్ధితో పాటు కోడింగ్, కళలు, క్రీడలు, కాలిగ్రఫీ, యోగా, వ్యక్తిత్వ వికాసంపై ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి కేంద్రంలో రిసోర్స్ పర్సన్లు, వలంటీర్లు, సబ్జెక్ట్ నిపుణులను నియమించి, లెర్నింగ్ మెటీరియల్, తాగునీరు, పారిశుధ్యం, భద్రతా చర్యలు కల్పించనున్నారు. అదే రోజు మంజూరైన పాఠశాల భవనాలు, అదనపు తరగతి గదులు, ల్యాబ్‌లు, మరుగుదొడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ కార్యక్రమాలు జరుగుతాయి.

### ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు..

మే 12న జిల్లాలో ఎస్సెస్సీ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం రెండు ప్రత్యేక రిమీడియల్ క్యాంప్‌లు ప్రారంభమవుతాయి. ఉదయం 9:30 నుంచి సాయంత్రం 4:30 వరకు జరిగే ఈ క్యాంపుల్లో సబ్జెక్ట్ నిపుణులతో రివిజన్, డౌట్ క్లారిఫికేషన్ తరగతులు నిర్వహిస్తారు. విద్యార్థులకు స్టేషనరీ కోసం రూ.100, రవాణా కోసం రూ.1000తో పాటు మధ్యాహ్న భోజన సదుపాయం కల్పిస్తారు. అదే రోజు మోడల్ స్కూల్స్, కేజీబీవీల్లో జరుగుతున్న ఇంటర్మీడియట్ రిమీడియల్ క్యాంపులకు ముగింపు కార్యక్రమాలు ఉంటాయి.

### విద్యా కార్యక్రమాలపై అవగాహన..

మే 13న సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో విద్యా కార్యక్రమాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తారు. విద్యాశాఖ విజన్, స్థానిక సంస్థల పాత్ర, నమోదు కార్యక్రమాలు, డిజిటల్ డీటాక్స్, ఎస్‌టీఈఎం, ఏఎక్స్ఎల్, ఎసెప్ కార్యక్రమాలు, విద్యార్థుల సంక్షేమ పథకాలు, ప్రీ ప్రైమరీ విద్య, బ్రేక్‌ఫాస్ట్ పథకం, సమగ్ర విద్య వంటి అంశాలపై చర్చిస్తారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లు కూడా హాజరుకానున్నారు.

### జయశంకర్ బడిబాట..

మే 14న 'జయశంకర్ బడి బాట' కార్యక్రమంలో భాగంగా ఉదయం ర్యాలీలు, ఇంటింటి నమోదు కార్యక్రమాలు చేపడతారు. పాఠశాలలను పండుగ వాతావరణంలో అలంకరించి, మధ్యాహ్న భోజన సిబ్బందితో వంటల పోటీలు, భవిత కేంద్రాల్లో తల్లిదండ్రుల సమావేశాలు, ఆలుమ్ని మీట్ నిర్వహిస్తారు. అన్ని జూనియర్ కళాశాలల్లో పీటీఎంలు, విద్యాసంస్థల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేస్తారు.

### సాంస్కృతిక దినోత్సవం..

మే 16న 'కళలు - చేతిపనులు - సాంస్కృతిక దినోత్సవం' పురస్కరించుకొని ప్రతి జిల్లాలోని బాలభవన్/బాలకేంద్రంలో చిత్రలేఖనం, చేతిపనులు, సాంస్కృతిక ప్రదర్శనల పోటీలు నిర్వహిస్తారు. సంప్రదాయ కళాకారులను ఆహ్వానించి, పర్యావరణహిత వస్తువుల వినియోగాన్ని



ప్రోత్సహిస్తారు. ఎంపికైన ఉత్తమ కళాఖండాలను రాష్ట్ర కళాభవన్‌లో ప్రదర్శిస్తారు.

### విద్యా సంబరాల దినోత్సవం..

మే 17న 'విద్యా సంబరాల దినోత్సవం'తో వారోత్సవం ముగుస్తుంది. హైదరాబాద్ పబ్లిక్ గార్డెన్‌లోని ఇందిరా ఆడిటోరియంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం ప్రారంభమవుతుంది. ఎస్‌సీఈఆర్‌టీ పుస్తక ప్రదర్శన, సమగ్ర శిక్ష, టాస్, ఇంటర్మీడియట్, ఉన్నత విద్యాశాఖల స్టాళ్లు ఏర్పాటు చేస్తారు. ఎస్సెస్సీ, ఇంటర్మీడియట్, క్రీడల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పురస్కారాలు, టీసాట్‌తో అవగాహన ఒప్పందం, సోలార్ కిచెన్ ప్రారంభం వంటి కార్యక్ర మాలు ఉంటాయి. జిల్లా స్థాయిలో కూడా ప్రధాన కార్యక్రమాలు నిర్వహించి, ప్రతిభావంతులైన ముగ్గురు విద్యార్థులను సన్మానించి, బుక్ ఎక్స్‌పోలు ఏర్పాటు చేస్తారు.

### లైబ్రరీ డే..

మే 15న 'లైబ్రరీ డే' సందర్భంగా "గ్రంథాలయాలు - జ్ఞానానికి హృదయం" అనే నినాదంతో పుస్తక ప్రదర్శనలు, మహిళా రచయితలు, స్వాతంత్ర్య సమరయోధులు, పర్యావరణ సాహిత్యం, బాలసాహిత్యంపై ప్రత్యేక ప్రదర్శనలు ఉంటాయి. బుక్ రివ్యూలు, బుక్ టాక్స్, 'ఎడోబ్ ఎ బుక్' కార్యక్రమం ద్వారా పుస్తకాల విరాళాలు సేకరిస్తారు. దివ్యాంగులకు అనుకూలంగా లైబ్రరీ సదుపాయాలు కల్పించి, ఉత్తమ పాఠకులు, లైబ్రేరియన్లు, వలంటీర్లను సన్మానిస్తారు.

## ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

**అక్షరటుడే, బాన్సువాడ:** ఉరి వేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బాన్సువాడ మండలం కొల్లూరు గ్రామ శివారులో చోటు చేసుకుంది. సీఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ప్రాంతంలో ఓ వ్యక్తి ఉరివేసుకుని మృతి చెందినట్లుగా అందిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.ృతుడు గ్రామానికి చెందిన బండారి సాయిలు అలియాస్ బొంబాయి సాయిలు (48)గా గుర్తించారు. మృతుడి భార్య బండారి సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీధర్ తెలిపారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

## నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకం..



**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్ర కీలకమని కమ్మర్‌పల్లి ఎస్సై అనిల్‌రెడ్డి పేర్కొన్నారు. కమ్మర్‌పల్లి మండల పరిధిలోని ఇనాత్ నగర్‌లో ఆదివారం సీసీ కెమెరాల ప్రాముఖ్యత, మాదకద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమ్మర్‌పల్లి ఎస్సై జి. అనిల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు పోలీసులకు మూడోకన్నులాగా పనిచేస్తాయన్నారు. ప్రతిఒక్కరూ తమ ఇళ్ల వద్ద, వ్యాపార సంస్థల వద్ద సీసీటీవీలను ఏర్పాటు చేసుకోవడం ద్వారా దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలను అరికట్టవచ్చని సూచించారు. అనంతరం మాదకద్రవ్యాల రహిత సమాజం గురించి మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. గ్రామంలో ఎవరైనా గంజాయి లేదా ఇతర మత్తు పదార్థాలు విక్రయించినా, సేవించినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. సమాజ రక్షణలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని ఆయన గుర్తుచేశారు.

## బోర్గాం(కె) గ్రామంలో ఉచిత వైద్య శిబిరం

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** మాక్లూర్ మండలం బోర్గాం(కె) గ్రామ సచివాలయం వద్ద ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రెండో డివిజన్ కార్పొరేటర్ మారంపల్లి మోహన్ ఆధ్వర్యంలో నగరంలోని శ్రీహర్ష డయాబెటిక్ కేర్ సెంటర్, జ్యోతి ల్యాబ్ సంయుక్తంగా శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రజలకు బీపీ, షుగర్, థైరాయిడ్‌కు సంబంధించిన పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ వైద్యులు సురేందర్ రెడ్డి రోగులను పరీక్షించిన అనంతరం డయాబెటిక్ పేషెంట్లకు తగు ఆహార నియమాలతోపాటు, వ్యాయామం గురించి సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బొట్టు వెంకటేష్, మట్ట చరణ్, నిర్వాహకులు గోవింద రావు, భూమేష్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## ట్రాక్టర్ టైర్ పేలి.. నలుగురికి గాయాలు




**అక్షరటుడే, ఆర్మూర్:** ట్రాక్టర్ టైర్ పేలి నలుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటన ఆర్మూర్ మున్సిపల్ పరిధిలో ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని నిజామాబాద్ రోడ్‌లో బృందావన్ థియేటర్ వద్ద ఆదివారం ట్రాక్టర్ టైర్ బ్లాస్ట్ అయింది. నిజామాబాద్ నుంచి ఆర్మూర్ పట్టణానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం జరగగా.. ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు కిందికి వెళ్ళింది. ఈ ఘటనలో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఇందులో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. 108 సిబ్బంది క్షతగాత్రులను ఆర్మూర్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు సమాచారం సేకరించి దర్యాప్తు చేస్తున్నారు.

## శ్రీనగర్‌లో దొంగల బీభత్సం.. పలు ఇళ్లల్లో చోరీలు



**అక్షరటుడే, బాన్సువాడ:** వర్ని మండలంలోని శ్రీనగర్ గ్రామంలో ఒకే రాత్రి తొమ్మిది ఇళ్లల్లో దొంగలు వరుస చోరీలకు పాల్పడ్డారు. గ్రామంలోని తొమ్మిది ఇళ్లలో చోరీలకు పాల్పడటంతో గ్రామస్థులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. ఒకే రాత్రిలో ఇంత పెద్ద ఎత్తున దొంగతనాలు జరగడం స్థానికంగా సంచలనంగా మారింది. కొందరి ఇళ్లలో బీరువాలు, అల్మారాలు పగులగొట్టి నగదు, బంగారు ఆభరణాలు, విలువైన వస్తువుల కోసం వెతికిన ఆనవాళ్లు కనిపించాయి. కొన్ని ఇళ్లలో వస్తువులు చిందరవందరగా పడివుండటంతో బాధితులు పోలీసులకు సమాచారం అందించారు. సీసీఎస్ ఏసీపీ మస్తాన్ అలీ, ఇన్‌స్పెక్టర్ సురేష్, వర్ని ఎస్సై వంశీకృష్ణ రెడ్డి వెంటనే గ్రామానికి చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. దొంగలు ఎంత మేరకు నగదు, బంగారం అపహరించారనే విషయంపై పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఒకేసారి తొమ్మిది ఇళ్లలో చోరీలు జరగడం ఇదే మొదటిసారి అని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో పోలీస్ పహారా పెంచాలని, రాత్రి సమయంలో గస్తీ నిర్వహించాలని కోరారు.

## భార్యాభర్తల గలీజు దందా..
## నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి..

**అక్షరటుడే, నిజామాబాద్ క్రైం:** సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న భార్యాభర్తలు గలీజు దందాకు తెరలేపారు. లిఫ్ట్ అడిగి నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి బెదిరించి డబ్బుల వసూళ్లకు తెరలేపారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని భార్యాభర్తలను కటకటాల వెనక్కి పంపారు. ఈ మేరకు రూరల్ పోలీసులు వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లా మధ్కేడ్ తాలూకా ముక్రంబాద్ గ్రామానికి చెందిన మంగేష్కర్ గైక్వాడ్, ఉజ్వల గైక్వాడ్ భార్యాభర్తలు. వీరు నగర శివారులోని మాధవ్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటున్నారు. సులభంగా డబ్బు సంపాదించాలనుకున్న వీరు గలీజ్ దందాకు తెరలేపారు. ఉజ్వల గైక్వాడ్ రెండు నెలలుగా కంఠేశ్వర్ బైపాస్, ఆర్మూర్ రోడ్డులో నిలబడి ఒంటరిగా బైక్‌పై వెళ్తున్న వారికి సైగలు చేస్తూ దగ్గరికి పిలుస్తుంది. అనంతరం రేటు మాట్లాడుకొని బైక్‌పై అతడిని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్తుంది. అయితే ఆమె భర్త వారిని ఫాలో అవుతూ వెనుక వెళ్తాడు. అక్కడకు వెళ్లాక బెదిరించి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇద్దరూ ఇలా పలు ప్రాంతాల్లో బైక్‌పై వెళ్లేవారిని శృంగారం పేరుతో తీసుకెళ్లి అత్యాచారయత్నం చేశాడని కేసు పెడ్తామని బెదిరించి డబ్బులు దండుకున్నారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నిఘావేసి ఈనెల 9న భార్యాభర్తలను నగరంలోని గూపన్‌పల్లి వద్ద అదుపులోకి తీసుకున్నారు. అనంతరం విచారించగా నేరం చేసినట్లు వారు ఒప్పుకున్నారు.

## దేశవ్యాప్త రైతాంగ పోరాటాలను ఉధృతం చేస్తాం : ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** దేశవ్యాప్త రైతాంగ పోరాటాలను ఉధృతం చేసేందుకు సమాయత్తమవుతున్నామని ఏఐయూకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వి ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. దేశంలో వ్యవసాయం పూర్తిగా తీవ్రమైన సంక్షోభంలో ఉందని ఆయన పేర్కొన్నారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడానికే అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) రైతులను సంఘటితం చేసి పోరాటాలు చేస్తోందని వివరించారు. ప్రధాని మోదీ అదాని, అంబానీ లాంటి కార్పొరేట్లకు కీలుబొమ్మగా మారి పూర్తిగా వ్యవసాయ రంగాన్ని వారికి అప్పగిస్తూ రైతులను బలి పశువులు చేస్తున్నారన్నారు. ఎంఎస్‌పీ చట్టం కోసం ఏళ్లుగా రైతాంగం పోరాడుతున్నా మోదీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల మెప్పు కోసమే ఎంఎస్‌పీ చట్టం చేయడం లేదని ప్రభాకర్ అన్నారు. ఇక్కడ అనేక వ్యవసాయ ఉత్పత్తులు ఉండగా అమెరికాలాంటి దేశాలకు తలొగ్గి దిగుమతులు చేసుకుంటూ ఇక్కడ మన వ్యవసాయ రంగాన్ని సంక్షోభంలోకి నెడుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ రంగాన్ని కాపాడుకోవడం కోసం పోరాటాలు చేయాల్సి వస్తోందన్నారు. అందులో భాగంగానే 16 రాష్ట్రాల్లో ఉన్న రైతు సంఘాలను ఐక్యం చేసి అఖిల భారత ఐక్య రైతు సంఘం (ఏఐయూకేఎస్) ఏర్పడిందని ప్రస్తుతం జాతీయ ప్రథమ మహాసభను బద్రాద్రి కొత్తగూడెంలోని ఇల్లెందులో మే 11,12,13 తేదీల్లో నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మహాసభల్లో 16 రాష్ట్రల నుండి 300 మంది ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు. రైతాంగా ఉద్యమలకు సంబంధించిన పలు అంశాలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు. మహాసభలకు జిల్లానుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలి రావాలని కోరారు.